పడగ విప్పిన డయేరియా

- పీఎం పాలెం గాయత్రీనగర్‌లో 22 మందికి నిర్ధారణ
- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరిన ఇద్దరు
- మరో ఇద్దరికి ఇంటి వద్దనే చికిత్స
- తాగునీటిలో పురుగులు ఉండేవన్న స్థానికులు
- పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి



ఇంట్లో చికిత్స పొందుతున్న హర్షిణి

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొందరికి డయేరియా సోకడం కలకలం రేపుతోంది. గత మూడు రోజుల్లో 20 కేసులు నమోదు కాగా శనివారం మరో రెండు కేసులు నమోదయ్యాయి. రోజురోజుకూ కేసుల సంఖ్య పెరగడంతో స్థానికులు హడలిపోతున్నారు.



డయేరియా వ్యాప్తికి కారణమైన నీళ్ల ట్యాంకు

వాటర్ ట్యాంక్ శుభ్రం చేయకపోవడంతో..

కాలనీకి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైందని స్థానికులు తెలిపారు. నీళ్లలో పురుగులు కనిపించేవని, మరో దారి లేక ఆ నీటినే తాగేవారమని తెలిపారు. ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే వానాకాలం నీటి సరఫరాపై ఇంత నిర్లక్ష్యం వహించడంపై ఆందోళన చెందుతున్నారు.



కాలనీలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

క్షీణించిన పారిశుధ్యం

19 బ్లాకులుగా ఉన్న ఈ కాలనీలో 576 ఫ్లాట్లలో ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ పారిశుధ్యం క్షీణించింది. పలు ప్రాంతాల్లో నీటి నిల్వలు, చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉన్నాయి. బురదగుంటలు ఏర్పడి పందుల ఆవాసంగా మారాయి. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ఈగలు, దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది.

కొనసాగుతున్న వైద్యశిబిరం

కాలనీలో డయేరియా కేసులు నమోదవడంతో పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి పల్లా సుజాన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి శుక్రవారం నాటికి 20 మంది వ్యాధికి గురైనట్లు గుర్తించామన్నారు. వారిలో 18మంది కోలుకోగా, ఇద్దరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. శనివారం మరో రెండు కేసులు గుర్తించి, వారికి డయేరియా నివారణ మందులు అందజేశామని తెలిపారు. ప్రస్తుతం వ్యాధి అదుపులో ఉందన్నారు. ఇద్దరు డాక్టర్లు, వైద్య సిబ్బందితో వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, 24గంటలూ వారు అందుబాటులో ఉంటారని చెప్పారు.



కాలనీలో పేరుకున్న మురుగు

ట్యాంకు నీటిలో పురుగులున్నాయి



కాలనీవాసులకు తాగునీరు సరఫరా చేస్తున్న ట్యాంకులోని నీరు పురుగులు పట్టింది. చాలాకాలంగా ట్యాంక్‌ను శుభ్రం చేయలేదు. అధికారులు పరీక్షకు పంపిన నీటిలోనూ చిన్న చిన్న క్రిములు ఉన్నాయి. నీరు కలుషితం కావడంతో దురదలు వంటి చర్మవ్యాధులు కూడా వచ్చాయి. నీటి సరఫరాలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటమే ఈ పరిస్థితికి కారణం.

– మజ్జి అప్పారావు, గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

ట్యాంకు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



మంచినీటి ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. పారిశుధ్య సిబ్బంది ప్రతి రోజూ చెత్తను తొలగించేలా చూడాలి. డ్రైనేజీల్లో పూడికల్లేకుండా తొలగించాలి. పేదలు నివసించే ఈ కాలనీపై అధికారులు శ్రద్ధ వహించాలి.

–జామి శివకుమార్, గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

కాల్వలు శుభ్రం చేయట్లేదు



మా కాలనీలో కాల్వలను రోజూ శుభ్రం చేయడం లేదు. చెత్త కూడా పేరుకుపోయి ఉంటోంది. పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మా ప్రాంతంపై దృష్టి సారించాలి. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. దోమలు పెరగకుండా మందు పిచికారీ చేయించాలి.

–అనిత, గాయత్రీ నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

రోగులు బయట తిరగొద్దు



డయేరియా వ్యాధి సోకినవారు పూర్తిగా కోలుకునే వరకు ఇళ్లకే పరిమితం కావాలి. అతి త్వరగా వ్యాపించే అంటువ్యాధి కనుక నిర్లక్ష్యం వహించొద్దు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలనీ అంతా వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి. –పల్లా సుజాన్, పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి

జాగ్రత్తలు పాటించాలి



కాలనీలో డయేరియా ప్రబలినందున అందరూ జాగ్రత్తగా ఉండాలి. మంచి నీటిని మరిగించి తాగాలి. పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తినే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూడాలి. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వ్యాపిస్తాయి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తీసుకోవాలి. రోడ్డు పక్క ఆహార పదార్థాలు తీసుకోవడం పూర్తిగా మానేయాలి.

–డాక్టర్ పి.మానస, స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి

పేదలకు న్యాయసహాయం సామాజిక బాధ్యత



సదస్సులో మాట్లాడుతున్న కార్యదర్శి సన్యాసినాయుడు

మధురవాడ: పేదలు, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రతీ న్యాయవాది యొక్క సామాజిక బాధ్యత అని విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్మన్ జి.వల్లభ నాయుడు, 1వ స్పెషల్ జడ్జి ఎ.రామచంద్రరావు అన్నారు. మధురవాడ ఎన్‌బీఎం లా కాలేజీలో విశాఖ న్యాయ సేవాసదన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. చట్టాలలో ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేసుల విచారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎం.సత్యసాగర్, ఆర్‌వీఏఎస్ఏ కిషోర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8వ వార్డులో స్ప్రేయింగ్



రుషికొండలో స్ప్రేయింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య లోపంతో వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పడకేసిన పారిశుధ్యం' కథనానికి అధికారులు స్పందించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎంవోహెచ్ కిషోర్ ఆదేశాల మేరకు రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, దుర్గానగర్, బీసీ కాలనీ, ఒమ్మివానిపాలెం ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో స్ప్రేయింగ్, ఫాగింగ్ నిర్వహించారు. డెంగ్యూ ప్రబలిన ప్రాంతాల్లో మరింత శ్రద్ధ తీసుకుని పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. డెంగ్యూ బారిన పడిన వారు ఎవరైనా ఉన్నారా అంటూ ఆరా తీస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల సమావేశం నేడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి మండల సమావేశం ఆదివారం మజ్జివలస పంచాయతీలోని సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు ఇంటి వద్ద జరగనుంది. మండల కమిటీలు, బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా చర్చించడానికి ఉదయం 10 గంటలకు ముఖ్య నాయకులతో పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సమావేశం కానున్నారు. ఈ మేరకు ముఖ్య నాయకులకు సమాచారం పంపించారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. నగరంలోని శ్యామల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు.

శ్రావణ మాసోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఐశ్వర్య లక్ష్మి అమ్మవారి శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. ఆలయంలో శనివారం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం మొత్తం ప్రతిరోజు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు, కుంకుమ పూజలు జరుగుతాయని తెలిపారు.

పీఎం ఫసల్ బీమా ప్రీమియం గడువు ఆగస్టు 15

పద్మనాభం: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి వచ్చే నెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. తుపాన్‌లు, కరువులు, అకాల వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి నష్టపోయిన రైతులకు ఈ పథకం ద్వారా నష్ట పరిహారం చెల్లిస్తారని పేర్కొన్నారు. వరి పంటకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులు ఎకరాకు రూ.420 చెల్లించాలన్నారు. సచివాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించాలని కోరారు.


110 మందికి కంటి వైద్య పరీక్షలు



మహిళకు కంటి వైద్య పరీక్ష చేస్తున్న వైద్యురాలు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలస లక్ష్మి విజయ మెడికేర్ ఆస్పత్రి వద్ద శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 110 మందికి పరీక్షలు చేశారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు అన్నా, రామభద్రరాజు, వై.రాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో సమాచార కమిషనర్



చావలి సునీల్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

ఐటీసీ అగ్నిప్రమాద ఘటనపై చిన్నశ్రీను ఆరా



ఐటీసీ వద్ద తెల్లవార్లూ పర్యవేక్షించిన గండ్రెడ్డి శ్రీనివాస్



ప్రమాదస్థలంలో వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ రామవరం రోడ్డులోని ఐటీసీ గిడ్డంగి వద్ద శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో ఘటనా స్థలిని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. సంఘటనపై ఆరా తీశారు. నష్టనివారణ చర్యలు చేపట్టాలని కోరారు. యాజమాన్యం ప్రమాదం నుంచి త్వరగా కోలుకుని మళ్లీ వ్యాపారం చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మజ్జి వెంకటరావు, పల్ల రమణ, కోరాడ వెంకటరమణారావు, షిణగం దామోదరరావు, రౌతు శ్రీను ఉన్నారు.

అప్రమత్తం చేసిన గండ్రెడ్డి: అగ్నిప్రమాదం గురించి ముందుగా స్పందించిన స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్ ఆనందపురం పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తం చేశారు. తెల్లవార్లు అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు.

అమ్మవార్లకు సారె సమర్పణపై దండోరా

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లికి, భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారికి మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు ఆషాఢ సారె ఇవ్వనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీల ప్రతినిధులు శనివారం సమావేశాలు ఏర్పాటు చేసి, దండోరా వేయించారు. ఆ రోజు ఉదయం సంతపేట కొత్తమ్మతల్లికి మధ్యాహ్నం మజ్జివలస రాస పోలమాంబకు గ్రామస్తులంతా ఉమ్మడిగా సాంస్కృతిక కార్యక్రమాలతో సారె సమర్పించనున్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

తగరపువలస: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయభాస్కర్ కోరారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనలో ఉపాధ్యాయులకు కరదీపికలు ఎంతో సహాయకారిగా ఉంటాయన్నారు. సమావేశంలో ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాల అనుభవాలను ఇతర ఉపాధ్యాయులతో పంచుకోవాలని, తద్వారా విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తనను సంప్రదించాలన్నారు. విద్యార్థులకు ఎలా బోధించాలో ఉదాహరణతో తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో దేవుడుబాబు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆదినారాయణ, వీవీ హిమబిందు, శివజ్యోతి, సీఆర్పీ తాటిపూటి త్రినాథ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో జి.శివరాణి, డైట్ అధ్యాపకుడు షేక్ అల్లావుద్దీన్ తదితరులు ఉపాధ్యాయులకు 8 అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.విజయకుమార్, ఎంవీటీ రత్నం, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు
- మధురవాడలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ ప్రారంభం



పద్మనాభం జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఉద్యోగులు



మధురవాడలో స్వచ్ఛాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మధురవాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. పర్యావరణానికి హానికారకమైన ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నివారించాలని సూచించారు. మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వచ్ఛాంధ్ర అవగాహన ర్యాలీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతా ఆరోగ్యంగా ఉండాలంటే ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మీనాకుమారి, మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక, వైద్యురాలు ప్రశాంతి, డాక్టర్ బాలాజీ, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ సుమ, పర్యవేక్షణాధికారి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో మానవహారం

పద్మనాభం: స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ పద్మనాభంలో ఉద్యోగులు శనివారం ర్యాలీ చేశారు. అనంతరం పద్మనాభం జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఏవో ఎంవీఎస్ చలం, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భీమునిపట్నం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు కళ్యాణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగతంగా తమ ప్రాంతాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకుంటే, ఎటువంటి అంటువ్యాధులు రావన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని వదిలేయాలని కోరారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలి



భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



తాటితూరు హైస్కూల్ వద్ద స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థి దశ నుంచే వారికి పర్యావరణంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాలు, భీమిలి మండలం తాటితూరులో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పాలిథిన్ వాడకం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాలలో డీపీవో శ్రీనివాసరావు, డీఎల్‌పీవో నిర్మలాదేవి, ఎంపీడీవో కేవీ నరసింహారావు, తహసీల్దార్ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి రాంబాబు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పాటు సర్దుబాటు పేరుతో వినియోగదారులపై మోపుతున్న విద్యుత్ భారాలను ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు అన్నారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు మేరకు ఆగస్టు 5 వరకు ప్రజలను చైతన్యపరచి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కారణంగా ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తామన్నారు. నాయకులు మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, లక్ష్మణరావు, ముత్యాలరావు, రాము, తోటయ్య తదితరులతో కలిసి చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై వినతి

మద్దిలపాలెం : ఏయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల బృందం తమ సమస్యలపై మంత్రి నిమ్మల రామానాయుడు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర యూనివర్సిటీ టీచర్స్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సంయుక్తంగా ఒప్పంద అధ్యాపకుల వేదనను మంత్రికి వివరించారు. హైకోర్టు తీర్పును ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనవరిలో జీవో నంబర్ 2ను టైం స్కేల్ అమలు చేయమని విడుదల చేస్తే ఇప్పటికీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మంత్రికి తెలిపారు. విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు, కోట పల్లవి, అలీ, వృంద్రుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కూపంగా ఐటీ సెజ్ జంక్షన్

15 రోజులుగా రోడ్లపైనే మురుగు



ఐటీ సెజ్ జంక్షన్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు



జంక్షన్ వద్ద పూడికతో నిండిన కాల్వ



రోడ్డుపై 200 మీటర్ల వరకు ప్రవహిస్తున్న మురుగు నీరు

మధురవాడ: విశాఖ ఐటీ సెజ్ జంక్షన్‌లో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. కొండలపై ఉన్న పరిశ్రమలకు వెళ్లాల్సిన మార్గం అంతా మురుగుతో నిండి ఉంది. డ్రైనేజీలు బ్లాక్ అయిపోవడంతో, సుమారు రెండు వారాలుగా జంక్షన్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ జంక్షన్ నుంచి బీచ్ రోడ్డు వైపు వెళ్లాల్సిన రోడ్డుపై కూడా సుమారు 200మీటర్ల పైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇన్ఫోసిస్ తదితర ఐటీ కంపెనీలతో పాటు మారుతీ సుజుకీ, వరుణ్ షోరూమ్‌లు ఇక్కడే ఉన్నాయి. వివిధ కంపెనీల్లో పని చేస్తున్న ఐటీ ఉద్యోగులతో పాటు వేలాదిమంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వారంతా మురుగులోంచే ప్రయాణించాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గడ్డి మందు తాగి ఇద్దరు యువకుల మృతి

వేర్వేరు గ్రామాల్లో ఘటనలు



మహరాజ్ కుమార్

తగరపువలస: ఆనందపురం మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందారు. ఆనందపురం సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలివి. కణమాం పంచాయతీకి చెందిన 24 ఏళ్ల మహరాజ్ కుమార్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా చింతలపాలెం గ్రామానికి చెందిన సానబోయిన రమణ వద్ద డ్రైవర్‌గా పనికి చేరాడు. ఈ క్రమంలో రమణ వద్ద రూ.1.20లక్షలు అప్పు తీసుకున్న మహరాజ్ కుమార్.. రెండు నెలల కిందట ఆ పని మానేశాడు. ఇంట్లో కూడా తన సమస్యల గురించి పెద్దగా చెప్పేవాడు కాదు. ఈ నెల 12న గ్రామంలోని కొండమీద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. అతని మేనమామ పినిశెట్టి శ్రీను చికిత్స నిమిత్తం ఆరిలోవలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్స పొందుతూ మహరాజ్ కుమార్ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బంటుపల్లి కళ్లాల్లో మరో యువకుడు



శంకర్

బంటుపల్లి కళ్లాలు ఆకులవారి వీధికి చెందిన గొర్లె శంకర్(28) మద్యానికి బానిసయ్యాడు. ఈ కారణంగా అతనికి వివాహం కావడం లేదు. దీంతో తనను ఎవరూ పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో ఈ నెల 14న ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. అతని తండ్రి కృష్ణ చికిత్స కోసం మారికవలసలోని గాయత్రి ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందాడు. మృతుడు కృష్ణ నలుగురు సంతానంలో చివరివాడు. అతని తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.